# 48. బాకీ వసూలయింది

"అమ్మయ్య! దేముల్లాగ కనిపించేవు గురూ" అన్నాడు బాబూరావు. బస్సు స్టాపులో నుంచున్న నన్ను చూసి మోపెడు ఆపి. (మోపెడు అప్పుడతను తొక్కుతూ వెళ్లడంలేదు; తోసుకుంటూ వెళ్తున్నాడంతే).

"ఏంటి, బండి ట్రబులా?" అన్నాను.

"ఒక్క బండి ట్రబులే ఏమిటి, బతుకంతా ట్రబులే అయిపోయింది నాకివాళ. అదేదో పద్యం చెప్తారు చూడూ -"గురువుల రాక, దాసి మృతి, గుర్రపు దాడి; పొరుగున అప్పు బాధ, చెవిపోటు, ఆలికి మైలయు, అల్లుడల్కయున్" అంటూనూ! అలాగయింది. నువ్వెంత వరకెళ్తున్నావు? ఇంటికేనా?"

"ఆ........ఇంటికే."

"అవుతే చిన్నసాయం చేసి పెట్టు. ఎలాగా నీది బస్సు పాసేకనక తోవలో పోలీస్ స్టేషన్ దగ్గిర దిగిపో, హెడ్ కాన్‌స్టేబిలు రంగరాజు ఇప్పుడు డ్యూటీలో అక్కడే వున్నాడు; నా ఫ్రెండు; తెల్సుకదా. అతను నాకు వందరూపాయలివ్వాలి" అని బాబూరావు మోపెడుకి స్టాండేసి జేబులోంచి కాయితం పెన్నూ తీసి చిన్న చీటీ రాశాడు. "రంగరాజా, నువ్వు నాకివ్వవలసిన వందరూపాయలూ ఈ చీటీ తెచ్చే నా పొరుగాసామీ గారికి (నా పేరు రాసేడు) ఇచ్చి. మోపెడు చెడిపోడం వల్ల నేను రాలేకపోతున్నాను. ఇట్లు, బాబూరావు."

'బుద్ధి లేకపోతే సరి. పోలీసు వాళ్లకీ దొంగలకీ అప్పులివ్వడమేమిటి!' అనుకుంటూ చీటీ జేబులో పెట్టుకున్నాను. బాబూరావు థేంక్సు చెప్పి వెళ్లిపోబోతూ మళ్లీ ఆగేడు. "ఇందాక ఫోన్ చేసేను. ఇంకా వొసూలవలేదు. కాని నువ్వు రా; నువ్వొచ్చీలోగా సెట్టింగు చేస్తాను - అన్నాడు. ఒకవేళ ఐదు-పది-నిమిషాలు కూచోవలిసొస్తే కూర్చోవాలి, సుమీ! తెల్లారగట్ట మా అల్లుణ్ణి రైలెక్కించాలి. "అని చెప్పి మరీ వెళ్లేడు.

బస్సుకోసం బోలెడు మంది జనం. ఇప్పుడిక్కడున్న జనం అంతా ఎక్కాలంటే కనీసం ఆరు బస్సులు లైనుగా రావాలి. (ఏ మాట కామాటే చెప్పుకోవాలి. మారూట్‌లో అయిదేసీ ఆరేసీ బస్సులు ఒకేసారి రావడం మామూలే.) - కొంచెం పక్కగా వెళ్లి నుంచున్నాను.

ఒకమ్మాయితో అంతసేపూ ఏదో మాట్లాడుతున్న ఒకబ్బాయి "ఇప్పుడే వస్తాను" అని వెళ్లేడు. ఆ అమ్మాయికి పాతికేళ్లుంటాయి. చామన చాయకి ఓ చాయ తక్కువలో ఉంది. ఏదో ఆఫీసులో పని చేస్తున్నట్టుంది. జెబ్బకి వేళ్లాడుతున్న బ్యాగు, చేతిలో ఒక ఫైలు.

పక్కనించి ఓ అరవై ఏళ్ల ముసలాయన ఆ అమ్మాయికి దగ్గిరిసా వొచ్చి అడిగేడు. "ఏంటవుతాడమ్మా ఆ అబ్బాయి నీకు?"

"ఏమీ అవడండి."

"బాగా పరిచయస్తుడా?"

"కాదండి. వాళ్లిల్లు కూడా మా ఇంటివేపే అని చెప్పేడు, అంతేను."

"మరైతే అతను ఆటో తీసుకొస్తానంటే అతనితో వెళ్లడానికి ఎలా ఒప్పేసుకున్నావు? రాత్రి అయిపోతోంది. అలా ఎరగని వాళ్లతో ఆటోలో వెళ్తే గోతులో పడిపోతావు. జేగర్త"

ఇంతలో ఆటో రానే వచ్చింది. ఆ అబ్బాయి ఆటోలోంచి దిగకుండానే, రండి మేడమ్- అన్నాడు.

అమ్మాయి వెళ్లలేదు. సమాధానం కూడా చెప్పలేదు. ఆటోవాడు " ఏంటిసార్. బేరం ఉందా లేదా?" అన్నాడు. అబ్బాయి దిగిపోయి ఆటోవాడి చేతిలో ఒక రూపాయి పెట్టి, "సారీ, బ్రదర్" అని జనంలో కలిసిపోయేడు.

రెండు బస్సులు వచ్చేయి. రెండూ ఇంచుమించు ఖాళీగానే ఉన్నా, జనం తోసుకుంటూ ఎక్కేరు. ముసలాయన ముందునుంచి ఎక్కేడు. అమ్మాయి తన చేతిలో ఫైలు ఉన్నాసరే; ముసలాయన చేతిలో వున్న ఒక పాకెట్ తనే పట్టుకుని సాయం చేసింది. నేను వెనకనించి ఎక్కి బస్సు మధ్య భాగానికి వచ్చేసరికి ఆయన రెండు చేతుల్లో రెండు సామాన్లు పుచ్చుకుని స్థలం కోసం వెతుకుతున్నాడు, కాని దొరకలేదు. కండక్టరు టికెట్టికెట్టంటూ జనాన్ని తోసుకుంటూ వొచ్చి ముసలాయన్ని కసిరేడు; "అసలే పెద్దవారు. ఇలా పెట్టెలూ, పేకెట్లూ పట్టుకుని బస్సులెక్కి మమ్మల్ని కాల్చుకు తినకపోతే ఏ ఆటోలోనో ఎక్కి వెళ్లకూడదటండీ?" ఆయన టిక్కెట్టుకోసం డబ్బులు తియ్యాలంటే ఏదో ఒక చెయ్యి ఖాళీ చేసుకోవాలి. అటూ, ఇటూ చూసి, ఈ పక్క సీట్లో కూచున్న అబ్బాయితో "ఇది కాస్త పట్టుకో బాబూ" అని పేకెట్ అందించాడు. "తేలిగ్గానే ఉంటుందిలే. దిగేటప్పుడు తీసుకుంటాను."

పోలీసు స్టేషన్ స్టాపుకి ఇవతలి స్టాపులో బస్సు ఆగుతూ వుండగా తాతగారి పేకెట్ పట్టుకుని కూచున్న ఆ అబ్బాయి లేచాడు. ఖాళీ అయిన సీటుకోసం జరిగిన ఆందోళనలో ఆయన ఇటు చూసేడు. "అయ్యో, అయ్యో; నా పేకెట్టు!" అన్నాడు ముసలాయన. నీ పేకట్టేంటి; ఇది నాది! నాటకాలుగా వుందే!" అని తూలనాడుతూ అతగాడు ఆడవాళ్లని తప్పించుకొంటూ ముందు వేపు నుంచి దిగిపోతున్నాడు. "పట్టుకోండి, పట్టుకోండి. దొంగ! నా పేకెట్టు పట్టుకు పోతున్నాడు!" అని ముసలాయన వేసిన కేకలకి ఇంచుమించు అందరూ స్పందించేరు. ముందు సీట్లో ఉన్న అమ్మాయి ఆ ప్యాకెట్ని పట్టేసుకుని "వదులు, ఇది ఆ తాతగారిది!" అంది. కండక్టరే వచ్చేరు. "ఔనయ్యా ఇది ఆ పెద్దాయనదే. ఒగ్గీ. ఏటి సంగతి? అసలెవడు నువ్వు? హోల్డాన్! ఆ తాతగారు ఈ పేకెట్ పట్టుకుని బస్సెక్కాడు. నేనూ సూసేను!"

"అంతేకాదండీ. ఇతనేమో, నేనేమో, బస్టాపులో నుంచుంటే నేమో; నన్ను పలకరించి యెక్కడిదాకా అని అడిగి ఇప్పుడప్పుడే బస్సురాదు, నేను దింపేస్తాను; ఆటోలో వెళ్దాం రమ్మని ఆటో తెచ్చేడండీ" అని ఆ అమ్మాయి చెప్పింది.

"తన్నండి ఎదవని. అన్నీ దొంగేసాలూ, ఎదవ బుద్ధులూనీ", అంది ఓ నాయిరాలు.

అబ్బాయి దిగిపోకుండా పట్టుకున్నారు జనం.

"పోలీస్టేషన్ కాడ ఆపు గురూ..." అన్నాడు కండక్టరు.

పోలీస్ స్టేషన్ దగ్గిర బస్సు ఆగగానే నేను దిగిపోయాను. స్టేషన్లో "హెడ్ కానిస్టేబుల్ రంగరాజు గారున్నారా?" అని అడగ్గానే కుర్చీలో ఉన్న ఒకాయన్ని చూపించేరు. చీటీ తీసి

ఇచ్చేను. "సారీ సార్. డబ్బు రడీగా లేదు. కుంచేపు కూకోండి" అని బెంచీ చూపించేరు. కూర్చున్నాను.

కండక్టరూ, అమ్మాయీ, అబ్బాయీ, ముసలాయినా, మరోముగ్గురు ప్రయాణికులూ స్టేషన్‌లో కొచ్చేరు. నాకు పాత కథే. కాని హెడ్ కానిస్టేబుల్ రంగరాజుగారికి కొత్త కథ కదా. వోపిగ్గా విన్నాడు. అడ్రసులు రాసుకున్నాడు.

"పాకెట్ నీదేనంటావా? ఏటి రుజువు? అందలేటుంది? రేడియో. కొన్నావా? బిల్లుందా? పట్టుకోమని నివ్వే ఇచ్చావా, అతగాడే పట్టుకుంటానని అడిగేడా?" - ఇలా ముసలాయన్ని అడిగాడు.

"ఛట్! పాకెట్ నీదైతే బిల్లు ఆ ముసలాయన జోబీలో ఎందుకుంది? ఏ సాపులో కొన్నావు? ఎంతక్కొన్నావు? రేడియోనే నయ్యా. అందల సెల్సున్నాయా?"- ఇలా అబ్బాయిని కొశ్చనింగు చేసేడు.

"సర్లే, ఎల్లవమ్మా ! పొద్దుగూకేదాకా ఆఫీస్‌లో కబుర్లాడుకుంటూ కూకోకపోతే ఎల్తురుండగానే కొంపకి జేర్రాదు? ఆటో తెత్తాననగానే రడీ అయిపోనావు. ఇలాగైతే రేపింకోడు కారుతెచ్చి తీస్కెల్తాడు. బుద్ధి గలిగెల్లు ఇయాల్టికి." అని అమ్మాయికి ఉపదేశం చేసేడు.

ఈలోపుగా " ముద్దాయి అబ్బాయి" అడ్రస్ రాసుకుంటూ రంగరాజు అతనికి ఆ కాగితం చూపించి : "సూడు. సమంగా రాసేనా?" అని అతని మొహం మీదికి ఎత్తేడు. అతను "యస్సార్, అలాగేసార్!" అన్నాడు.

"ఎల్లండెల్లండి. నేను కేసు రాస్తాన్లెండి." అని ఒక నెంబరు పలకడం ద్వారా ఒక కాన్‌స్టబుల్ని పిల్చి ముద్దాయిని లోపలికి తీసికెళ్లమన్నాడు. కండక్టర్ని, అమ్మాయిని, ముసలాయన్ని, ప్రేక్షక ప్రయాణికుల్ని పంపేశాడు. బయట బస్సు బయల్దేరిన చప్పుడయింది.

వాళ్లు వెళ్లిన రెండు నిమిషాలకి తనూ లోపలికి వెళ్లేడు రంగరాజు గారు; "ఒరే, ఈనకి టీ ఇచ్చేర్రా?" అనికేకేస్తూ; తను నా పనిమీద కూడా ఉన్నట్టు సూచిస్తూ.

టేబిలు మీంచి కాగితం ఎగిరొచ్చి నా ముందు పడింది. దాని మీద అడ్రసులున్నాయి. చివరి అడ్రసు ఆర్. అప్పారావు, డోరు నెంబరు, తండ్రిపేరు, వీధిపేరు అన్నీ వున్నాయి. 'సమంగా రాసేనా, లేదా-చూడు' అన్నాడే ; అక్కడుంది ఒక అంకె. రు. 100.

రంగరాజుగారు లోపల్నించీ, ఒక మనిషి పైనించీ వచ్చేరు. రంగరాజుగారు బాబూరావు కియ్యవలసిన వంద రూపాయలూ నాకిచ్చేరు. ఆ మనిషి టీ కూడా ఇచ్చేడు. నేను టీ తాగుతూ వుంటే 'అబ్బాయి' సెగరెట్టు కాల్చుకుంటూ దర్జాగా నడిచి రోడ్డు మీదకి వెళిపోయాడు.

రోమియో అప్పారావు రోడ్డు మీదికి చేరేడు.

బాబూరావు బాకీ వసూలయిపోయింది.

★